సాక్షి కరీంనగర్

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025





బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

కరీంనగర్ సిటీలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అంబారాన్నంటాయి. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. – కొత్తపల్లి



కొలువుదీరిన దుర్గమ్మ

దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గామాత కొలువుదీరారు. నగరంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో శ్రీబాలత్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. నగరంలోని కూడళ్లలో నెలకొల్పిన మండపాల వద్ద అమ్మవారికి వైభవంగా పూజలు నిర్వహించారు. – కరీంనగర్‌కల్చరల్



మహాశక్తి ఆలయంలో భక్తులు

బోనాలపల్లెకు తూటా గాయం!



- ఫైరింగ్ రేంజ్ నుంచి జనావాసాల వైపు బుల్లెట్లు
- ఎలగందుల ఫైరింగ్ రేంజ్‌లో పోలీసుల కాల్పుల సాధన
- గతంలో బోనాలపల్లి, ఎలగందుల మధ్య అడ్డుగోడలా గుట్టలు
- గుట్టలు కరగడంతో బోనాలపల్లి వైపు దూసుకొస్తున్న వైనం
- ఫైరింగ్ క్యాంప్ ఎత్తేయాలని గ్రామస్తుల డిమాండ్
- అధ్యయనానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం



బోనాలపల్లె గ్రామం

ఈ నెల 20న బోనాలపల్లి గ్రామంలో అమృతమ్మ అనే 80 ఏళ్లు పైబడిన వృద్ధురాలి తుంటికి బుల్లెట్ తాకింది. ఈ ఘటనలో వృద్ధురాలు స్వల్పంగా గాయపడింది.

అమృతమ్మ ఘటనకు వారం ముందు బోనాలపల్లికి చెందిన ఓ ఇంటికి తూటా తగిలింది. ఇలాంటివి ఇటీవల కాలంలో పెరిగాయని గ్రామస్తులు వాపోతున్నారు.



గాయం, తూటా.. ఇంటి రేకును ఛిద్రం చేసిన బుల్లెట్



బుల్లెట్ ఇక్కడే పడిందని చూపిస్తున్న గ్రామస్తురాలు పద్మ

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

అది బోనాలపల్లి గ్రామం.. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి హామ్లెట్ విలేజ్. ఇంత వరకూ ఈ గ్రామం గురించి లోకానికి తెలిసింది తక్కువే. కానీ, రెండుమూడు రోజులుగా ఈ ఊరు అకస్మాత్తుగా వార్తల్లోకెక్కింది. ఇటీవల ఈ గ్రామస్తులను పోలీసు తూటాలు భయపెడుతున్నాయి. గ్రామానికి సమీపంలోని ఫైరింగ్ ప్రాక్టీస్ గ్రౌండ్ నుంచి దూసుకువస్తున్న తూటాలతో వీరిలో ప్రాణభీతి నెలకొంది. పగటి పూట ఎప్పుడు ఏ దిశగా ఏ బుల్లెట్ దూసుకువస్తుందో తెలియక.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయంభయంగా బతుకుతున్నారు. అక్కడ ఎలాంటి యుద్ధ వాతావరణం లేదు, అదేమీ ఇండియా–పాకిస్తాన్ సరిహద్దులో ఉండే గ్రామం కూడాకాదు. ఇవన్నీ పక్కనబెడితే.. కనీసం ఛత్తీస్‌గఢ్ సమీపంలో ఉన్న ఆదివాసీ గ్రామం కూడాకాదు. ఇవేమీ కానప్పుడు ఈ గ్రామం మీదకు పోలీసు తూటాలు ఎందుకు దూసుకువస్తున్నాయి. ఎందుకు గ్రామస్తులను గాయపరుస్తున్నాయి? అన్న విషయాలపై 'సాక్షి' పలు విషయాలు సేకరించింది. మరోవైపు ఈ విషయంపై పోలీసులు దృష్టి సారించారు. బుల్లెట్లు ఎందుకు గ్రామం మీదకు వస్తున్నాయి? ఒకవేళ గుట్ట ఎత్తుతగ్గడం వల్లనా? లేక తూటాలు మధ్యలో రాళ్లకు తగిలి దిశ (డైరెక్షన్) మార్చుకున్నాయా? అన్న విషయంపై హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాన్ని తీసుకువచ్చి అధ్యయనం చేయించనున్నారు.

నేపథ్యం ఇదీ..

బోనాలపల్లి గ్రామం ఎలగందుల గ్రామానికి హామ్లెట్ విలేజ్. ఎలగందులలో కొన్ని దశాబ్దాలుగా పోలీసులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. పోలీసులు కాల్చిన బుల్లెట్లు అక్కడే ఉన్న గుట్టను తాకేవి. ఇన్నేళ్లకాలంలో ఏనాడూ పోలీసుల బుల్లెట్లు ప్రజలను తాకిన సందర్భాలే లేవంటే అతిశయోక్తి కాదు. కానీ, కొన్నిరోజులుగా పోలీసులు కాల్చిన తూటాలు బోనాలపల్లి గ్రామస్తులను ఎందుకు తాకుతున్నాయి? అన్న ప్రశ్నకు గ్రామస్తులే సమాధానం చెబుతున్నారు. ఎలగందుల ఫైరింగ్ రేంజికి బోనాలపల్లి గ్రామానికి మధ్యలో గ్రానైట్ గుట్టలు ఉండేవి. ఇవి రెండుగ్రామాల మధ్య పెట్టని గోడలా ఉండేవి. ఫలితంగా పోలీసులు కాల్చిన తూటాలు ఆ గుట్టను తాకి అక్కడే పడిపోయేవి. కొంతకాలంగా మైనింగ్ కారణంగా గుట్టలు క్రమంగా కరిగిపోతున్నాయి. ఫలితంగా పోలీసుల తూటాలకు అడ్డుకునే ఆటంకాలేవీ లేకుండాపోయాయి. దీంతో దాదాపు 500 మీటర్ల దూరంలో ఉన్న బోనాలపల్లిని తూటాలు నేరుగా తాకుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల20న అమృతమ్మ అనే వృద్ధురాలి తుంటికి తూటా తగిలి తీవ్ర గాయమైంది. ఇదే తరహాలో తూటాలు వాకిళ్లలో, ఇంటిపైకప్పుల్లో పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ఈ తూటాలు ఎవరిని తాకినా ప్రాణాలు పోవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సాధన చేసే ఫైరింగ్ రేంజ్ నుంచి తూటాలు రాకుండా చేయాలని లేదంటే, దాన్ని అక్కడ నుంచి బదిలీ చేయాలని బోనాలపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫైరింగ్ బంద్ కావాలె



సమీపంలోని ఎలగందుల ఫైరింగ్ రేంజ్ నుంచి బుల్లెట్లు గ్రామం మీదుకు దూసుకువస్తున్నాయి. ఈ భయానికి పిల్లలు కూడా స్వేచ్ఛగా బయట తిరిగే పరిస్థితి లేదు. ఈ విషయంపై వెంటనే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ స్పందించి ఫైరింగ్ రేంజ్ పాయింట్‌ను ఇక్కడ నుంచి తరలించాలి.

– మధు, మాజీ వార్డ్ మెంబరు, బోనాలపల్లె

రాయితో కొట్టిర్రు అనుకున్నా



కొంతకాలంగా ఊరి మీదకు తూటాలు దూసుకువస్తున్నయ్. మొన్న శనివారం నా తుంటికి ఏదో దెబ్బ తగిలింది. తొలుత ఎవరో రాయితో కొట్టారని అనుకున్నా. తీరాచూస్తే అది తుపాకీ తూటా అని తెలిసింది. కొడుకులు నన్ను దవాఖానాకు తీసుకుపోయిన్రు. సాయంత్రం పోలీసులు వచ్చి చూసి, నన్ను ఫొటో కొట్టుకుని పోయిన్రు. ఆ దేవుడే కాపాడిండు.

– అమృతమ్మ, బోనాలపల్లె

ఎవరు బాధ్యులు



ఇలా బుల్లెట్లు వచ్చి ఆరుబయట తిరుగుతున్న వారికి తగులుతుంటే మాకు రక్షణ ఎలా? ఆ రోజు మా అమ్మకు బుల్లెట్ వేగం తగ్గి తాకింది. అదే తీవ్రతతో తాకి ఉంటే అమ్మ పరిస్థితి ఏంకాను? పోలీసులు వచ్చి చూసిపోయిన్రు. శనివారం తూటా తీసుకెళ్లిన్రు. ఈ ఘటనకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? దీనిపై కలెక్టర్, సీపీ స్పందించాలె.

– మల్లేశం, అమృతమ్మ కుమారుడు

హైదరాబాద్ నుంచి టీం వస్తుంది

ఈ విషయం మా దృష్టికి వచ్చింది. మా టీం వెళ్లి పరిసరాలను పరిశీలించింది. బుల్లెట్లు గ్రామం మీదకు ఏ కారణం వల్ల దూసుకువస్తున్నాయి? అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గుట్ట ఎత్తు తగ్గడం వల్లనా? లేక బుల్లెట్ దారిలో ఏదైనా రాయి తగిలి దిశ (డైరెక్షన్)మార్చుకుందా? అన్న విషయంపై అధ్యయనం జరగాల్సి ఉంది. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం కరీంనగర్‌కు రానుంది.

– గౌస్ ఆలం, పోలీస్ కమిషనర్, కరీంనగర్



నిత్యం నిఘా.. పెట్రోలింగ్

- పండుగ పూట అప్రమత్తంగా ఉండాలి
- పోలీసులకు సమాచారమిచ్చి ఊరెళ్లాలి
- శివారు ప్రాంతాల్లో స్పెషల్ ఫోకస్
- ఆఫర్లంటూ వచ్చే ఫేక్ లింకులను క్లిక్ చేయొద్దు

ఆపదలో 87126 70744 నంబర్ లేదా 100కు కాల్ చేయాలి

- 'సాక్షి'తో సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం:

దసరా పండగ సందర్భంగా చోరీల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సీపీ గౌస్ ఆలం పేర్కొన్నారు. పోలీసుల చర్యలతో పాటు ప్రజల అప్రమత్తత కూడా తోడయితే దొంగతనాలను నివారించవచ్చన్నారు. దసరా, బతుకమ్మ సందర్భంగా కమిషనరేట్ వ్యాప్తంగా ప్రజలు నగరం నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్తుంటారని, ఇళ్లు ఖాళీగా ఉండడంతో చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చని వివరించారు. ఇళ్లు వదిలి వెళ్తే పోలీసులకు సమాచారమివ్వాలని, పండుగ సమయంలో ఫిర్యాదుల కోసం ప్రత్యేక కంట్రోల్‌రూం నంబర్ ఏర్పాటు చేశామని తెలిపారు. బతుకమ్మ, దసరా పండగ నేపథ్యంలో సోమవారం 'సాక్షి'కి పలు విషయాలు వెల్లడించారు.

పండుగకు ఊర్లెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

సీపీ: పండుగలకు ఇళ్లు వదిలి గ్రామాలకు వెళ్లేవారు ముందుగా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. తద్వారా పెట్రోలింగ్ బృందాలు ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాయి. అలాగే పక్కవారికి కూడా ఎవైనా అనుమానాస్పద విషయాలుంటే సమాచారమివ్వాలని చెప్పాలి.

డబ్బు, బంగారం విషయంలో?

సీపీ: ఊర్లెళ్లే సమయాల్లో బంగారం, డబ్బు ఇంట్లో ఉంచకుండా వెంట తీసుకెళ్లాలి. లేదా లాకర్‌లో భద్రపరచడం ఉత్తమం. బీరువా తాళంచెవులు ఇంట్లో అస్సలు పెట్టకూడదు. ఊరెళ్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో స్టేటస్‌లు పెట్టొద్దు. ఇంట్లో లైటు వేసి ఉంచాలి.

కాలనీల్లో సీసీ కెమెరాల ఉపయోగం?

సీపీ: పలు కాలనీలు, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల చోరీలను నియంత్రించవచ్చు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు పోలీసులకు సహకరించాలి. సీసీ కెమెరాలు ఇళ్లను, రోడ్డును కవర్ చేసేలా అమర్చితే చాలా మంచిది.

పండుగ పేరిట సైబర్‌నేరాలు జరిగే అవకాశముందా?

సీపీ: ఆన్‌లైన్ షాపింగ్ విషయంలో పండుగ పేరిట బోలెడు లింక్‌లు వస్తుంటాయి. వీటిపై అప్రమత్తంగా ఉండాలి. ఆకర్షణీయమైన ఆఫర్‌లు అంటూ వచ్చే మెస్సేజ్‌లు, బ్లూ కలర్ లింక్‌లను ఓపెన్ చేయొద్దు. లాటరీలు, గిఫ్ట్‌లని, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామనే సందేశాలను నమ్మొద్దు.

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచారా..?

సీపీ: పండగ సందర్భంగా సాధారణ రోజుల కంటే ఎక్కువ పెట్రోలింగ్ ఉంటుంది. శివారు ప్రాంతాల్లో కూడా పోలీసుల పెట్రోలింగ్ పెంచాము. సెలవుల్లో ఖాళీగా ఉన్న ఇళ్లకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ టీములు సైతం సేవలందిస్తున్నాయి.

సమస్యలు తలెత్తితే పోలీసులను ఎలా కాంటాక్ట్ కావాలి..?

సీపీ: దసరా, బతుకమ్మ సందర్భంగా చోరీ లు, ఇతర సమస్యలు తలెత్తితే కరీంనగర్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. 87126 70744 నంబర్‌కు కాల్ చేయవచ్చు. అత్యవసరమయితే డయల్ 100 ఫోన్ చేయాలి. ఆన్‌లైన్ మోసాలు, ఫిర్యాదుల కోసం www.cybercrime.gov.in లేదా 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

న్యూస్‌రీల్

భవాని దీక్ష స్వీకరణ



కరీంనగర్‌కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో భవాని దీక్ష స్వీకరించారు. ఆయన కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుల ద్వారా దీక్షా కంకణాన్ని ధరించారు. ఈసందర్భంగా ప్రజలకు ముందస్తు దేవీ నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సేవలు ఎలా ఉన్నాయి?



కరీంనగర్‌క్రైం: జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి వెంకటేశ్ సోమవారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విచారణ ఖైదీలతో ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, గంజాయి, నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలుంటాయన్నారు. విచారణ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, జైలు రమేశ్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

దళారులకు పత్తి అమ్మొద్దు



జమ్మికుంట(హుజూరాబాద్): దళారులకు పత్తి అమ్మి రైతులు ఆర్థికంగా నష్ట పోవద్దని, నాణ్యమైన పత్తిని మార్కెట్ తీసుకొచ్చి మంచి ధర పొందాలని మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్నసదానందం అన్నారు. సోమవారం మార్కెట్‌లో క్రయ విక్రయాలను పరిశీలించి మాట్లాడారు. సీసీఐకి పత్తి అమ్ముకునే రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, మార్కెట్‌లో క్వింటాల్ కొత్త పత్తి గరిష్ఠ ధర రూ.6,222 పలికింది. 29 వాహనాల్లో 106 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకవచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ. 5,521, కనిష్ఠ ధర రూ.3,200 వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయవిక్రయాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్ –2 కార్యదర్శి రాజా పర్యవేక్షించారు.

పోక్సో కోర్ట్ స్పెషల్ పీపీగా రాజేశం



కరీంనగర్‌క్రైం: పోక్సో కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు–2 స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది మంచికట్ల రాజేశం నియమితలయ్యారు. సోమవారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శరత్ సమక్షంలో విధుల్లో చేరారు.

కలిసొచ్చేనా..

- స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై మార్గదర్శకాలు విడుదల
- జెడ్పీ నుంచి సర్పంచ్ వరకు మారనున్న సమీకరణాలు
- పల్లెల్లో రిజర్వేషన్లపై జోరందుకున్న ప్రచారం
- ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం ముమ్మర కసరత్తు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

'అన్న దసరా పండుగ వస్తోంది. మన గ్రామంలో అమ్మవారి విగ్రహం పెడుతున్నాం. చందా రాయండి. వచ్చే ఎన్నికల్లో మీరు పోటీచేసేవాళ్లు.. గెలవాలంటే మీరు ముందుపడాలి' అంటూ నిర్వాహకుల మాటలకు... 'తమ్మి రిజర్వేషన్ కలిసొస్తే పోటీ చేస్తా. ప్రభుత్వం రోజుకో మాట చెబుతోంది. ఇప్పటికే ఎన్నికలు నిర్వహిస్తారనుకొని, అడిగిన ప్రతివారికి వినాయక చందాలురాశా. అన్నదానం చేయించా. ఇప్పుడు పెద్దపండుగ దసరా వచ్చే. సరే రాసుకో తమ్మి రిజర్వేషన్ కలిసిరాకపోతుందా.. నేను పోటీచేయకపోతానా.. నన్ను అయితే గుర్తుంచుకో' అంటూ ఆశావహులు, నిర్వాహకులను సమాధానపరుస్తున్నారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఆదివారం రిజర్వేషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో పల్లెల్లో ఎక్కడ నలుగురు కలిసినా రిజర్వేషన్లు,ఎన్నికలపై ముచ్చటించుకుంటున్నారు.

జెడ్పీ చైర్మన్ బీసీలకేనా?

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపులపై మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అధికారులతో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లను కలెక్టర్, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు ఆర్డీవో, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఆయా వార్డుల్లోని కులాల వారీగా మార్కింగ్ చేసుకొని ప్రకటించనున్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వే ఆధారంగా బీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించనున్నారు. గత ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాలకు కేటాయించిన సీట్లను మినహాయించి, మిగిలిన కేటగిరిలో ఉన్న సీట్లలోనే బీసీలకు అదనంగా కల్పించనున్నారు. దీంతో గతంలో బీసీలకు రిజర్వేషన్ అయిన సీట్లతో పాటు మరికొన్ని స్థానాలు పెరగనుండటంతో ఏయే స్థానాలు బీసీలకు కేటాయించనున్నారోననే చర్చ ఆశావహుల్లో కొనసాగుతోంది. గతంలో కేటాయించిన మహిళ రిజర్వేషన్లకు తోడు, 50 శాతానికి తగ్గకుండా మహిళలకు లాటరీ ద్వారా స్థానాలు కేటాయించనున్నారు. దీంతో జెడ్పీ చైర్మన్ బీసీలకే దక్కనుంది. అయితే బీసీ జనరల్ అవుతుందా? లేదా బీసీ మహిళకు కేటాయిస్తారా అనేదానిపై ఆశావహులు అంచనా వేసుకుంటున్నారు. ప్రభుత్వం అధికారికంగా రిజర్వేషన్లు ప్రకటించేవరకు ఎవరికి తోచినట్లు వారు లెక్కలు వేసుకుంటున్నారు.

ముందు పరిషత్ ఎన్నికలే

సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి ఇప్పటికే హైకోర్టు గడువు విధించింది. ఇందులో భాగంగా ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం మరింత గడువు కోరాలని చూస్తూనే, మరోపక్క ఎన్నికలు నిర్వహించేదుకు సన్నద్ధం అవుతోంది. కాగా, ఇప్పటికే పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను ప్రకటించారు. ప్రభుత్వం తొలుత పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతుండటంతో ఆశావహులు తాము పోటీ చేయదల్చుకున్న స్థానంలో రిజర్వేషన్ ఏది అమలవుతోందో స్పష్టత లేక సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో..

పంచాయతీలు	318
వార్డులు	2,962
ఎంపీటీసీలు	170
జెడ్పీటీసీలు	15
పురుష ఓటర్లు	5,52,353
మహిళ ఓటర్లు	5,30,337
ఇతరులు	61
మొత్తం ఓటర్లు	10,82,751



ఘనంగా బతుకమ్మ వేడుకలు

బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని మహాత్మజ్యోతిబాపులే మైదానంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తులఉమ ఆడిపాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి, మాజీ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు. లోయర్ డ్యాంలోని లేక్ పోలీస్ స్టేషన్ వద్ద మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. – కరీంనగర్ కల్చరల్

స్నాతకోత్సవానికి రండి

- హాజరు కానున్న కేంద్రీయ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ బీజేరావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): శాతవాహన విశ్వవిద్యాలయం రెండో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. గవర్నర్, శాతవాహన చాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ నవంబర్ 7న స్నాతకోత్సవం నిర్వహణకు అనుమతినిచ్చినట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం గవర్నర్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు హాజరు కానున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీ పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలు అందజేస్తామన్నారు. 2019 ఆగస్టులో తొలిస్నాతకోత్సవం జరిగిందని, ఇప్పుడు ద్వితీయ స్నాతకోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శాతవాహన వర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్

క్లుప్తంగా

గంజాయి విక్రేతల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని ఎస్‌కే ఎన్ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్ల పల్లికి చెందిన నర్ర హరీశ్, పట్టణంలోని మోతె మాలవాడకు చెందిన దమ్మ ఉదయ్‌కిరణ్ డిగ్రీ కళాశాల సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టణ ఎస్సై రవికిరణ్ వారిని పట్టుకుని తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో జీపీ సిబ్బందికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెంలో విద్యుత్‌షాక్‌తో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న చలిగంటి సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గ్రామపంచాయతీ పక్కన మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్‌చేసి వీధిలైట్లు వేసిన సురేశ్ మరో వీధిలో వీధిలైట్లు వేసేందుకు ట్రాక్టర్ ట్రైలర్ ఎక్కి విద్యుత్ బల్బు అమర్చుతుండగా విద్యుత్‌షాక్‌కు తగిలి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సురేశ్‌ను కారులో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్‌షాక్‌కు గురైన విషయాన్ని ఎంపీడీవో, ఎంపీవో, డీపీవోకు దృష్టికి తీసుకెళ్లారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు పరీక్షల్లో ప్రతిభ చూపితే.. ఏటా ఉపకారవేతనాలు అందిస్తోంది. ప్రతీనెల రూ.వెయ్యి చొప్పున సాయం చేస్తోంది. 2025–26 విద్యా సంవత్సరంలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం ప్రకటన వెలువడింది. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఎయిడెడ్, వసతీసౌకర్యం లేనిఆదర్శ స్కూళ్ల విద్యార్థులే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఆటో బోల్తా: నలుగురికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం హన్మాజీపేటలో సోమవారం ఉదయం ఆటో బోల్తాపడి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాలపల్లికి చెందిన సాయిలు తన ఆటోలో మహిళలను ఎక్కించుకుని జగిత్యాలకు వస్తున్నాడు. హన్మాజీపేట వద్ద ద్విచక్ర వాహనం అడ్డు రావడంతో తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న పొరండ్లకు చెందిన నక్క గంగవ్వ, తోట గంగు, మెడపట్ల లక్ష్మీ, సాయిలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదంపై కేసు

- రూ.13.50 లక్షలకు పైగా నష్టం
- పోలీసుల అదుపులో నిందితుడు ?

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనగర్ హుమెరా ఇండస్ట్రీస్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ ఫ్యాక్టరీలో ఆదివారం రాత్రి మంటలు అంటుకోగా ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో ప్లాస్టిక్ కవర్ మెటీరియల్, ఒక బైకు, డీజిల్ జనరేటర్ తోపాటు వివిధ వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.13.50లక్షలకు పైగా విలువైన సామగ్రి కాలిపోయినట్లు షాపు యజమాని హఫీజ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అడిషినల్ డీసీపీ వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వ్యక్తే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనుమానితునికి, షాపు యాజమాన్యానికి మధ్య గొడవ జరగడంతో ఆదివారం ఎవరూ లేని సమయంలో నిప్పు పెట్టినట్లు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై ఇండస్ట్రియల్, ఫైర్ అధికారులు సైతం దర్యాప్తు చేస్తున్నారు.

‘కొస’ముట్టని ప్రస్థానం

- ప్రజాసమస్యలపై అజ్ఞాతం
- గోపాల్‌రావుపల్లె నుంచి దండకారణ్యంలోకి..
- ఆగిన 45 ఏళ్ల పోరాటం
- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కొన మృతి
- మృతదేహాలను గుర్తించని కుటుంబ సభ్యులు



సత్యనారాయణరెడ్డి మృతదేహం



రాంచంద్రారెడ్డి మృతదేహం

సిరిసిల్ల: పీడిత.. తాడిత ప్రజల కోసం దశాబ్దాల క్రితం పోరుబాట పట్టిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు మావోయిస్టు అగ్రనేతలు ఒక్కరొక్కరుగా నేలకొరుగుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, జిల్లాకు చెందిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొన అలియాస్ సాధు మరణించినట్లు పోలీసులు ప్రకటించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెకు చెందిన కడారి సత్యనారాయణరెడ్డి 45 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం ముగిసింది.

విద్యావంతుల కుటుంబం

సత్యనారాయణరెడ్డి తండ్రి కిష్టారెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి అన్నమ్మ గృహిణి. సోదరుడు కరుణాకర్‌రెడ్డి రిటైర్డు ఎంఈవో. సోదరి జయమ్మ ఇప్పటికే మరణించారు. కొన తండ్రి కిష్టారెడ్డి 2013 జూన్ 8న, తల్లి అన్నమ్మ 2012 నవంబరు 14న మరణించారు. తల్లిదండ్రులు మరణించినా చివరి చూపునకూ సత్యనారాయణరెడ్డి రాలేదు.

ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా..

ప్రస్తుతం తెలంగాణలో మావోయిస్టు ప్రాబల్యం తగ్గింది. పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రాల్లో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మూడు కుటుంబాల్లో కలవరం మొదలవుతుంది. దండకారణ్యంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కొన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 కోట్ల రివార్డు ప్రకటించాయి. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన చంద్రయ్య అలియాస్ ఆజాద్, ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన శ్రీనివాస్ అలియాస్



గోపాల్‌రావుపల్లెలోని సత్యనారాయణరెడ్డి ఇల్లు

భరత్, అలియాస్ యాదన్న, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన బాలసంతుల ఉప్పలయ్య అలియాస్ చిన్నన్నలు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. ఆ నలుగురిలో సత్యనారాయణరెడ్డి మరణించినట్లు పోలీసులు ప్రకటించగా.. మిగిలిన ముగ్గురు ఎక్కడ ఉన్నది వారి కుటుంబ సభ్యులకు తెలియదు. పార్టీ సైతం వారి సమాచారాన్ని బహిర్గతం చేయడం లేదు. కోనరావుపేట మండలం శివంగాళపల్లెకు చెందిన జ్యోతి అలియాస్ జ్యోతక్క మూడేళ్ల క్రితం పోలీసులకు లొంగిపోయారు. 20 ఏళ్లపాటు అజ్ఞాతంలో ఉన్న జ్యోతి పోలీసులకు లొంగిపోయి స్వగ్రామంలో ఉంటోంది. బాలసంతుల ఉప్పలయ్య అలియాస్ చిన్నన్న మూడు దశాబ్దాలుగా ఎక్కడ ఉన్నారో.. ఎలా ఉన్నారో తెలియదు.

ఉద్యోగం చేస్తూ ఉద్యమంలోకి..

గోపాల్‌రావుపల్లెకు చెందిన కడారి సత్యనారాయణరెడ్డి సిరిసిల్లలో ప్రాథమిక విద్యను అభ్యసించి పెద్దపల్లి ఐటీఐ పూర్తి చేశారు. బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరిన సత్యనారాయణ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారు. ఈక్రమంలో సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజర్ హత్యకు గురికాగా.. ఆ కేసులో జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చాక అప్పటి సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస)లో పనిచేస్తూ పీపుల్స్‌వార్‌లో చేరారు. 1980 ప్రాంతంలో ఉద్యమంలోకి వెళ్లిన సత్యనారాయణరెడ్డి మావోయిస్టు పార్టీలో దాదాగా, కొసగా.. సాధు పేర్లతో కొనసాగారు.

కేంద్ర కమిటీ సభ్యులే టార్గెట్‌గా ఆపరేషన్లు

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులే టార్గెట్‌గా కేంద్ర బలగాలు ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస బస్వరాజ్ ఎన్‌కౌంటర్‌లో మరణించగా.. మరో కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు నర్సింహాచలం అలియాస్ సుధాకర్, గాజర్ల రవి అలియాస్ గణేశ్, రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి, అలియాస్ జయరాం, పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, మోడం బాలకృష్ణ మరణించారు. తాజాగా నారాయణపూర్ జిల్లాలో జరిగిన



కొస సోదరుడిని కలిసిన ఎస్పీ అఖిల్‌మహాజన్ (ఫైల్)

ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణరెడ్డి, కట్ట రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో కరీంనగర్ జిల్లాకు చెందిన మావోయిస్ట్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ ఉన్నారు.

గోపాల్‌రావుపల్లెపై నిఘా

కడారి సత్యనారాయణరెడ్డి సొంతూరు గోపాల్ రావుపల్లెపై నాలుగు దశాబ్దాలుగా పోలీసుల నిఘా కొనసాగింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసులు అనేక పర్యాయాలు గోపాల్‌రావుపల్లెకు వచ్చి వెళ్లారు. ఆయన పోస్టర్లను ఊరిలో ప్రదర్శించారు. సత్యనారాయణరెడ్డి తల్లి అన్నమ్మ, తండ్రి కిష్టారెడ్డి మరణించిన సందర్భాల్లోనూ పోలీసులు నిఘా పెట్టారు. 1996లో కొన వరంగల్ జిల్లాలో అరెస్టయి మూడునెలల జైలులో ఉండి విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2025 జనవరిలో రాజన్నసిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ కొన స్వగ్రామంలో అతని సోదరుడు రిటైర్డు ఎంఈవో కరుణాకర్‌రెడ్డిని కలిశారు. కొన జనజీవన స్రవంతిలో కలిసేలా చూడాలని కోరారు.

ఫొటోలు గుర్తించని కుటుంబ సభ్యులు

కడారి సత్యనారాయణరెడ్డి ఫొటోను అతని అన్న కరుణాకర్‌రెడ్డి నిర్ధారించలేదు. అతను తమ తమ్ముడు కాదని స్పష్టం చేశారు. కానీ చాలా ఏళ్ల తరువాత తమ్ముడి ఫొటోను చూసి గుర్తించలేకపోయినట్లు భావిస్తున్నారు. మావోయిస్టు పార్టీ మరో కేంద్ర కమిటీ సభ్యుడు కట్ట రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అతని భార్య మాలతి సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన రామచంద్రారెడ్డితోపాటు కొన ఎన్‌కౌంటర్‌లో మరణించడం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చర్చనీయాంశమైంది.

ఈ-కేవైసీ ఉంటేనే రేషన్!

- కొత్త కార్డుదారులకు ప్రభుత్వ సూచన



కరీంనగర్ అర్బన్: నూతనంగా రేషన్ కార్డు పొందిన వారంతా తస్మాత్ జాగ్రత్త. ఈ-కేవైసీ ఉంటేనే రేషన్ సరకులు ఇవ్వనున్నారు. తుది గడువంటూ లేకపోగా వీలైనంత త్వరగా సదరు ప్రక్రియ చేసుకోవడమే ఉత్తమం. ఇటీవల రెండు నెలల కాలంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈ-కేవైసీ తప్పనిసరని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కార్డులో పేర్లున్న కుటుంబ సభ్యులందరూ దగ్గరలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ-పోస్ యంత్రంలో బయోమెట్రిక్ వేలిముద్రలు అప్డేట్ చేయించుకోవాల్సి ఉంటుంది.

రెండేళ్లుగా ఈ-కేవైసీ ప్రక్రియ...

రేషన్ కార్డులో ఉన్నవారందరూ ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని రెండేళ్లుగా ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తిచేసింది. అయితే ఇప్పటికీ అనేక సార్లు గడువు పొడిగించింది. కరీంనగర్ జిల్లాలో 3.01లక్షల రేషన్ కార్డులుండగా 40 వేల మందికిపైగా కొత్తరేషన్ కార్డులు మంజూరయ్యాయి. కార్డులు మంజూరైన వారికి సెప్టెంబరు నెలలో బియ్యం కోటాకూడా విడుదలైంది. వారికి ఈ నెలలో బియ్యం పంపిణీ చేశారు. 32,577 మంది కుటుంబ సభ్యుల పేర్లను పాతకార్డుల్లో జత చేశారు. పాత కార్డులో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్నవారు కూడా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని అధికారులు వివరించారు.

ఆధార్ అప్‌డేట్ లేక అవస్థలు..

ఆధార్ నవీకరణ(అప్డేట్) లేకపోవడంతో కొందరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజలు ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్డేట్ ప్రక్రియ పూర్తిచేయించుకున్నప్పటికీ ఈ-కేవైసీ ప్రక్రియలో వేలిముద్రలు రావడంలేదు. కారణం తెలుసుకోవాలని బాధితులు ఇతర కేంద్రాలకు వెళ్లి వాకబు చేయగా.. ఆధార్ అప్డేట్ పూర్తి కాకపోవడంతో ఈ-కేవైసీ తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. దీంతో లబ్ధిదారులు వేర్వేరు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. కరీంనగర్ జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యపై అధికారులు స్పందించి మరిన్ని ఆధార్ కేంద్రాలను అందుబాటులో ఉంచితే ప్రజలకు ఉపయోగపడుతుందని పలువురు కోరుతున్నారు. కొత్త రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని, సదరు ప్రక్రియకు తుది గడువు రాలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు వివరించారు.

పంపిణీకి సిద్ధంగా ‘దీపిక’ పుస్తకాలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర విద్యా పరిశోధన, అభివృద్ధి శిక్షణ సంస్థ ముద్రించిన అభ్యాస దీపికలు జిల్లా కేంద్ర గోదం నుంచి ఎమ్మార్సీలకు చేరాయి. దసరా సెలువుల తర్వాత వీటిని పంపిణీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. గతేడాదికన్నా ఈసారి మెరుగైన ఫలితాలు సాధించడం లక్ష్యంగా వీటిని పంపిణీ చేయాలన్నదే లక్ష్యం.

సులభంగా అర్థమయ్యేలా..

పదో తరగతి విద్యార్థులకు అభ్యాసన కరదీపికలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని డీఈవో మాధవి తెలిపార. ఎమ్మార్సీల నుంచి పాఠశాలలకు చేరనున్నాయని వివరించారు. వీటి ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని అన్నారు. తద్వారా ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



నిల్వచేసిన అభ్యాసన దీపిక పుస్తకాలు

వెంకన్న భక్తులకు రైళ్ల సౌకర్యం

రామగుండం: తిరుమల – తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లే అవకాశం ఉంది. వీరికోసం రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్ల నుంచి తిరుపతికి ప్రతీరోజు, వారాంతపు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. వివరాలు..

రామగుండంలో బయలు దేరే సమయం

- ఏపీ సంపర్క్‌క్రాంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12708): ప్రతీ సోమ, గురు, శనివారం ఉదయం 3.40 గంటలు
- హిమసాగర్ ఎక్స్‌ప్రెస్(16318): ప్రతీ బుధవారం మధ్యాహ్నం 2.53 గంటలు
- తిరునల్వేలి ఎక్స్‌ప్రెస్(16788): ప్రతీ శనివారం మధ్యాహ్నం 3.28 గంటలు
- కేరళ ఎక్స్‌ప్రెస్(12626): ప్రతీరోజు సాయంత్రం 5గంటలు

పెద్దపల్లి జంక్షన్ నుంచి..

- తిరుపతి ఎక్స్‌ప్రెస్(12762): ప్రతీ ఆది, గురువారం: రాత్రి 8.05గంటలు
- ధర్మవరం స్పెషల్(07189): ప్రతీ శుక్రవారం రాత్రి 10.05గంటలు
- తిరుపతి స్పెషల్(07015): ప్రతీ శనివారం రాత్రి 10.05గంటలు
- కేఎస్ఆర్ బెంగళూర్ స్పెషల్(05074): ప్రతీ ఆదివారం రాత్రి 8.20 గంటలు
- తిరుచానూరు(07039): స్పెషల్ ప్రతీ మంగళవారం రాత్రి 10.05గంటలు
- కోయంబత్తూర్ స్పెషల్(03679): ప్రతీ ఆదివారం రాత్రి 11.10గంటలు

దసరా ధమాకా!

- రూ.50 కొట్టండి.. నాటుకోడి, ఫుల్‌బాటిల్ గెలుచుకోండి
- వాట్సాప్, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం

కరీంనగర్‌రూరల్: దసరా జోష్‌ను క్యాష్ చేసుకునేందుకు గ్రామాల్లో పలువురు పలు రకాలుగా ఆలోచిస్తున్నారు. రూ.50 చెల్లించి ఒక కూపన్ కొంటే చాలు.. నాటుకోడి, టీచర్స్ మద్యం బాటిల్ గెలుచుకోవచ్చంటూ ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా చెర్లభూత్కూర్‌లో రూ.50 చెల్లించి కూపన్ తీసుకోండి దసరా ధమాకా గెలుచుకోండి అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మొదటి బహుమతిగా నాటుకోడి, టీచర్స్ ఫుల్‌బాటిల్, రెండో బహుమతిగా బ్లెండర్‌స్ప్రైడ్ రిజర్వ్ ఫుల్‌బాటిల్, మూడో బహుమతిగా రాయల్‌స్టాగ్ ఫుల్‌బాటిల్ గెలుచుకోండంటూ వాట్సాప్, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇది స్థానికంగా చర్చనీయాంశమైంది. చెర్లభూత్కూర్‌తోపాటు సమీప గ్రామాలు దుబ్బపల్లి, చామనపల్లి, తాహెర్‌కొండాపూర్, మొగ్దుంపూర్‌కు చెందిన వ్యక్తులు కూపన్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది.



చెర్లభూత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రతిభ వెలికితీసేందుకు ‘అల్ఫోర్స్ అటెంప్ట్ 2025’



మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి అల్ఫోర్స్ అటెంప్ట్ పరీక్ష నిర్వహించినట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో సోమవారం నిర్వహించిన ‘అల్ఫోర్స్ అటెంప్ట్ 2025’ పరీక్ష ప్రారంభించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షకు 634 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలను రెండు రోజుల్లో విడుదల చేసి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహాలతో పాటు విద్యాసంస్థలో విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వివిధ పాఠశాలల యజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన యువకుడు

- రూ.10 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం
- 13 ఏళ్లు మృత్యువుతో పోరాటం
- ఎల్లారెడ్డిపేటలో విషాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదమూడేళ్లుగా ఆ యువకుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు యువకుడి ప్రాణాలు కాపాడడానికి ఆస్పత్రుల్లో రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా చివరికి అతను ఓడిపోయాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో విషాదం నింపింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన జోగుల నాంపెల్లి(41) పెట్రోల్‌పంపులో పనిచేస్తుండేవాడు. కొంతకాలం క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు.



నాంపల్లి (ఫైల్)

ఆస్పత్రిలో చూపించగా జాండీస్ వ్యాధికి గురైనట్లు వైద్యులు తెలిపారు. దీంతో పలు ఆస్పత్రుల్లో వైద్యం అందించారు. ఈక్రమంలోనే షుగర్ వ్యాధికి గురయ్యాడు. 13 ఏళ్లుగా వివిధ ఆస్పత్రుల్లో వైద్యం పొందడానికి మిత్రులు, కుటుంబ సభ్యులు కలిసి రూ.10 లక్షలు ఖర్చు చేశారు. కాగా ఇటీవల రెండు మూత్రపిండాలు(కిడ్నీలు) పాడవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గత 15 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. అంత్యక్రియలకు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి రూ.5వేలు సాయం అందించారు.

ఎల్ఎండీకి నీటి విడుదల



మిడ్‌మానేరు నుంచి విడుదలవుతున్న నీరు

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీకి 2,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 4,500, మరో 2 వేల క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా చేరుతోంది. మిడ్‌మానేరు నుంచి ప్యాకేజీ–9కి 561, ప్యాకేజీ–10 అనంతగిరికి 3,200 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 27.248 టీఎంసీలకు చేరింది.

సముద్రంలోకి ‘ఎల్లంపల్లి’ నీళ్లు



దిగువకు పరవళ్లు తొక్కుతున్న గోదావరి

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదలయ్యే నీరు సముద్రగర్భంలో కలవడం నీటిపారుదల శాఖ అధికారుల్లో ఆశ్చర్యం రేకెత్తిస్తుంది. ఏటా జూన్ ఒకటి నుంచి మే 31వ తేదీ మధ్య ఇరిగేషన్ ఇయర్‌గా పరిగణిస్తారు. ఈ మధ్య కురిసిన వర్షాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. అయితే, ఏటా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకోవడంతో ఒకసారి అధిక స్థాయి, మరోసారి అల్పస్థాయిలోకి ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉంటున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వచ్చే వరద నీటిని గేట్ల ద్వారా దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈసారి గత నాలుగు నెలల్లో అత్యధికంగా నీరు గోదావరి ద్వారా సముద్రంలో కలిసిపోయిందని అధికారులు వివరిస్తున్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వివరాలు..

ప్రాజెక్టు నీటి మట్టం 148 మీటర్లు. నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ప్రాజెక్టులో ఆదివారం నీటిమట్టం 147.55 మీటర్లు ఉండగా, నీటినిల్వ 18.92 టీఎంసీలు ఉన్నట్లు వివరించారు. 1.57 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి 1.03 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

నాలుగేళ్లలో..

– 2022–23 : ప్రాజెక్టులోకి 1,240.77 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా గేట్లు ఎత్తి 1,182.83 టీఎంసీలను గోదావరిలోకి వదిలారు.

– 2023–24 : 393.79 టీఎంసీలు ఇన్‌ఫ్లో రాగా 371.18 టీఎంసీలను నదిలోకి విడుదల చేశారు.

– 2024–25 : 329.05 టీఎంసీలు ఇన్‌ఫ్లో రాగా 276.53 టీఎంసీలను గోదావరిలోకి విడుదల చేశారు.

– 2025–26 : ఆరంభం నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకు 707.82 టీఎంసీలు ఇన్‌ఫ్లో రాగా ఇప్పటి వరకు 684.84 టీఎంసీలను గోదావరిలోకి విడుదల చేశారు. ఈ నీరంతా సముద్రంలో కలిసినట్లు అధికారులు అంటున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి..

సుల్తానాబాద్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేసినా.. అందులో దొడ్డు బియ్యం శాతమే ఎక్కువగా ఉంటున్నాయని హోటళ్లకు మినీ ఆటో డ్రైవర్లు సరఫరా చేస్తున్నారు. హోటల్ నిర్వాహకులు రేషన్ బియ్యాన్ని పట్టించి స్వరపిండి అమ్ముతున్నారనే విమర్శలున్నాయి.



ఆటోలో రేషన్ బియ్యం

ఎన్టీయార్ గెస్ట్‌హౌస్ ఇక ఉండదు



1994లో రాజన్న దర్శనం కోసం వచ్చిన ఎన్టీయార్ లక్ష్మీపార్వతీ దంపతులు బస చేసిన గెస్ట్‌హౌస్



ఎన్టీయార్ గెస్ట్‌హౌస్‌లోని ఫర్నిచర్, డోర్లు తొలగించి కూల్చేందుకు సిద్ధం చేసిన ఆలయ సిబ్బంది

వేములవాడలో రాజన్న ఆలయ విస్తరణలో భాగంగా గుడి పరిసరాల్లోని వివిధ భవనాలను కూల్చివేస్తున్నారు. ఇందులో భాగంగా రాజన్న గెస్ట్‌హౌస్‌ను సైతం తొలగించనున్నారు. 1994లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు (ఎన్టీయార్) తన సతీమణి లక్ష్మీపార్వతితో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. ఆ సమయంలో సీఎం కోసం ప్రధాన గెస్ట్‌హౌస్‌ను సిద్ధం చేశారు. ఇదే గెస్ట్‌హౌస్‌లో ఎన్టీయార్–లక్ష్మీపార్వతీ బస చేశారు. అప్పటి నుంచి ఎన్టీయార్ గెస్ట్‌హౌస్‌గా పిలుస్తుంటారు. ఆలయ విస్తరణలో భాగంగా ఈ గెస్ట్‌హౌస్‌ను కూల్చివేయనున్నారు. – వేములవాడ



సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై మూలమలుపు

డేంజర్ టర్నింగ్స్

గంభీరావుపేట(సిరిసిల్ల): సిద్దిపేట–కామారెడ్డి జిల్లాలను కలుపుతూ రాజన్నసిరిసిల్ల జిల్లా మీదుగా ప్రయాణించే రోడ్డు ప్రమాదకరంగా ఉంది. వాహనం వేగం పెంచేలోపే టర్నింగ్ వస్తుండడంతో ప్రయాణం ఆలస్యమవుతుంది. అంతేకాకుండా



ఎగువమానేరు ప్రాజెక్టు సమీపంలో లో లెవల్ వంతెన

మూలమలుపు ముందు ఉండన్న హెచ్చరికబోర్డులు కనిపించవు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి చౌరస్తా నుంచి గంభీరావుపేట మండలం లింగన్నపేట వరకు 16 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దూరంలో అనేక మూలమలుపులు, లోలెవల్ వంతెనలు ఉన్నాయి. నర్మాల ఎగువమానేరు పొంగితే రెండు వైపులా రాకపోకలు నిలిచిపోతుంటాయి.



రాజన్నకు జనహారతి

వేములవాడ: రాజన్నను సోమవారం 20 వేలకుపైగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల పూలతో అలంకరించారు. అక్టోబర్ 3 వరకు దేవీ నవరాత్రోత్సవాలు కొనసాగనున్నాయి.





● ఆస్కార్ ఎంట్రీ

మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను 'మీ ఊరికి పోండి' అని సాటి మనుషులే తరిమికొడితే 'ఇంటి వైపు' నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీసిన 'హోమ్‌బౌండ్' ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

హోమ్‌బౌండ్

మే 21, 2025.

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.

సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.

బహుశా ఆ చప్పట్ల మోత 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా'ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.

పేరు: హోమ్‌బౌండ్.

నిజ సంఘటన ఆధారంగా...



ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. 'టేకింగ్ అమృత్ హోమ్' అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో, వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి 'హోమ్‌బౌండ్'ను తీశాడు.

అదే దర్శకుడికి అదే గుర్తింపు

'హోమ్‌బౌండ్' (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘేవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన 'మసాన్' సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్త్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే 'హోమ్‌బౌండ్'కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కోర్‌సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్‌బౌండ్' రెండవ స్థానంలో నిలిచింది. 'మసాన్' సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

ఇద్దరు స్నేహితుల కథ

'హోమ్‌బౌండ్' షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ 'దేశం' అనే 'ఇల్లు' వీరికి 'కొందరికి' ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. 'కానిస్టేబుల్ ఉద్యోగం' వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వి కపూర్ నటించింది. కరణ్ జొహార్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.

ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.



"'జిన్ షిన్ జ్యుషు' అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్."

నవశక్తి



'ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..

ఫైర్ ముఖ్యం



"మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజిసి, టీ ఆర్జీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.

ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రెనింగ్‌తో పాటు రేంజ్ సెక్షన్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్టుల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రెనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రెనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రెనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రెనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రైనింగ్ తీసుకుంటున్నాను" అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,16,410	1,14,500	1,13,070	1,14,500	1,15,200	1,13,020
బంగారం (22 క్యారెట్లు)	1,08,250	1,06,300	1,03,650	1,06,300	1,05,980	1,03,600
వెండి	1,39,000	1,36,400	1,48,000	1,36,400	1,37,000	1,48,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్‌ఐపీహెచ్‌ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన/ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.
Email: dirphmniphm-ap@nic.in

26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969

అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌సీ-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.



సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుకులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.

మునగ మేలు!







మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి
ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..
మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం
ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్ళు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్పేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.



బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

కావలసినవి	ఖర్చు (రూ.)
1 కేజీ విత్తనం	2,000
1,000 పాలిథీన్ సంచులు	1,294
నగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక	600
ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు	2,500
100 కేజీల వేప పిండి	1,500
6 కేజీల ట్రికోడెర్మా జీవన ఎరువు	600
4 లీటర్ల వేప నూనె	2,400
40 కేజీల జిప్సం	400
4 బస్తాల యూరియా	1,070
2 బస్తాల పొటాష్	3,000
5 బస్తాల సూపర్ ఫాస్పేట్	1,810
అర లీటరు రీజెంట్	400
దీపపు ఎరలు	300
సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా)	17,874

మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్మొచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754